# 5

# పిల్ల చూపులు

వెంకట సుబ్బారావు బాగాచదువుకున్న యువకుడట. రేపోమాపో విదేశాలకెళ్ళ బోతున్నాడుట. పెళ్ళి చేసుకుని మరీ పోదామనుకుంటున్నాడుట. (పెళ్ళాన్ని తీసుకునేనా? ఏమో మరి.)

పెళ్ళి చూపులు చాలా నవీనంగా — అప్టుడేట్ గా జరగాలన్నాడు. అసలు పెళ్ళి చూపులంటే గంగిరెద్దుని చూసినట్లు పిల్ల భామవేషం చూడ్డానికి కాదుట. ఆ పిల్లకి తెలివి తేటలవీ వున్నాయో—లేవో, ఆదర్శాలవీ వున్నాయో లేవో—తెలుసుకుందుకట. అందుకే పిల్లతో ముఖాముఖీ మాట్లాడాలన్నాడు. సుబ్రావ్ వెంకట్.

పిల్ల ఒప్పుకుంది. పిల్లగలవాళ్ళూ ఒప్పుకున్నారు. అంతకు ముందు ఓ వారం రోజుల క్రిందట అటు పెద్దలూ— ఇటు పెద్దలూ ఏవేవో మాట్లాడుకున్నారు. కిందా మీదా పడ్డారు.

ఇది— సుబ్రావ్ ఒక్కడే పిల్లతో మాట్లాడానికొచ్చిన రెండో ఘట్టం. పిల్లగారిల్లు చాలా పెద్దది. సినిమాల్లో సెట్టింగ్‌లా అధునాతనమైనది. పెళ్ళిచూపులకోసం ప్రత్యేకమైన హడావుడి ఏమీ చెయ్యలేదు. పెళ్ళికూతురుకూడా ఎప్పట్లా కాటన్ చీరతో సింపుల్‌గానే వుంది. ఆ పిల్లకూడా బాగా చదువుకున్నదే. యూనివర్శిటీ అంతు చూసేసింది. అప్పట్నుంచీ గోళ్ళు గిల్లుకుంటూ కూచుంది. అలా గిల్లేస్తోంటే గోళ్ళు మాత్రం ఎంతకని పెరుగుతాయి?....విసుగొచ్చింది. ఏమీ తోచటంలేదని—

పోనీ భార్య పాత్ర ధరించేద్దామా అని ఆలోచిస్తోంది. భర్త వేషంవేసి హిట్టయ్యే వాడికోసం (అవుతాడని నమ్మకం వున్నవాడికోసం) ఎదురు చూస్తోంది—అదీ పిల్ల ప్రస్తుతాశ్రమం.

సుబ్రావ్ సిగరెట్‌తో సిగరెట్ అంటించుకుంటూ—సీరియస్‌గా ఆలోచిస్తూ, ఓ సోఫాలో ఇబ్బందిగా కూచుని వున్నాడు. పిల్లతండ్రి—ఆ యింటి యజమాని—ఏవో కాలక్షేపం కబుర్లు చెప్తున్నాడు. పెళ్ళికూతుర్ని జబ్బు మనిషిని పట్టుకున్నట్టు ఎవ్వరూ పట్టుకోలేదు. ఆ పిల్ల ఒక్కతే మామ్మూలుగా నవ్వుతూ వచ్చింది. వస్తూనే వెంకటసుబ్బారావుకి నమస్కారం చేసింది. వాళ్ళ నాన్నదగ్గిర మరో సోఫాలో కూచుంది.

అప్పటికి తేరుకుని కంగారు పడిపోయాడు సుబ్బారావు. "ఎక్స్క్యూజ్ మీ! ఎక్స్క్యూజ్ మీ! అయాం వెరీ సారీ!... ఏదో ఆలోచిస్తున్నాను. మిమ్మల్ని రిసీవ్ చేసుకోలేదు." ఇప్పుడు నమస్కారం పెట్టాలా అక్కర్లేదా అని క్విక్‌గా ఆలోచిస్తూ గబగబా అన్నాడు. పిల్ల కొంచెం నవ్వింది. "ఫర్వాలేదు లెండి" అంది మృదువుగా.

ముసలాయన తనిక తప్పుకోవచ్చనుకుని కాలక్షేపానికో పేపరందుకున్నాడు. ఓసారి కూతుర్ని చూస్తూ పెద్దరికం అంతా ప్రదర్శించి, సుబ్బారావుని చూపిస్తూ, "ఈయన నీతో మాట్లాడాలనే వచ్చారమ్మా! నిన్నడిగిన వాటికి నీకు తెలిసినట్లు చెప్పు. నీకేమైనా అడగాలనుంటే అడుగు. దట్సాల్" అనేసి పేపరడ్డం పెట్టుకుని రాజకీయాశ్రమంలో మునిగిపోయాడు.

సుబ్రావ్ పిల్లకేసి చూశాడు. పల్చగా, తెల్లగా, అందంగా, సింపుల్‌గా.... నచ్చుతోన్నట్టే వుంది.

పిల్లకూడా సుబ్రావ్‌ని చూసింది. టైట్‌గా బట్టలూ, సమ్మర్ క్రాఫింగూ, బోడిమొహం (మీసాల్లేని మొహం అని గమనించ ప్రార్థన) స్మార్ట్‌గా వున్నాడు చూడ్డానికి.

రెండు నిముషాలు చూసింది, ఏమైనా అడుగుతాడేమోనని. ఎంతైనా యింటివాళ్ళకున్న చొరవ వీధి వాళ్ళకుండదు కాబట్టి అతగాడి బిడియం తొలగించటానికి—"మీరే ట్రైన్‌లో వచ్చారా?" అంది "కీ" యిస్తూ.

అందుకున్నాడు "అసలు మెయిల్లో రావాలనుకున్నానండీ! నా కసలు సైమంతా జర్నీలో వేస్టు చెయ్యటం అంటే పడదు. వెధవది, మెయిల్ మిస్సయింది. జనతాలో రిజర్వేషన్ కుదరలేదు. వెధవది ప్యాసింజర్‌లో వచ్చాను. హోటల్లో రూమ్ బుక్ చేసుకుని కొంచెం రెష్ట్ తీసుకున్నాను. డర్టీ ట్రైన్స్, డర్టీ గవర్నమెంట్స్" అన్నాడు సెంటు పూసుకున్న సిల్కు రుమ్మాలుతో రుసరుస లాడుతోన్న మొహం ఒత్తుకుంటూ.

"నిజమేనండీ! ఈ రోజుల్లో ట్రైన్స్‌లో ప్రయాణం అంటే భయం వేస్తోంది" తనూ ఒప్పేసుకుని సానుభూతి చూపించింది అమ్మాయి.

ఆ సందడిలో కాస్సేపు ధారాళంగా మాట్లాడేశాడు గవర్నమెంటు గురించి. గవర్నమెంటు కసలేమీ తెలీదుట. ఎన్నో చెయ్యాలిట. ఎంతో సంస్కరించాలిట. వెధవది ఏమీ చెయ్యదుట. "ఫూలిష్ గవర్న్‌మెంట్" అన్నాడు ఆఖర.

మాట్లాడి మాట్లాడి హఠాత్తుగా అడిగాడు పిల్లని "మీ పేరేమిటి? వాటీజువర్ నేమ్?"

పిల్ల మల్లెపువ్వులా నవ్వింది. "మా అమ్మమ్మ పేరే పెట్టారట నాకు. పాతపేరే లెండి. సూరమ్మ

సుబ్రావ్ మొహం చూడాలి. కళ్ళు మిటకరించాడు.

"నా పేరు బావుందా మీకు?" సూరమ్మ అడిగింది.

"అహ! బావుండటానికి కేవిటి?.... మీకూ తెలుసు పాతపేరు. బావు లేదు."

"మరెలాగ?"

"ఎలా గేవిటి? మార్చేసుకోవాలి. లేకపోతే బవోదు."

"ఎలా మార్చుకుంటే బావుంటుం దంటారు?"

సుబ్రావ్ కాస్సేపు క్విక్‌గా... ఆలోచన్లు పరిగెత్తించాడు—సునీత—సుతీన—సులేఖ—సుఖేల—సుజాత—సుతాజ సు.... సు.... సుందరి....

సుందరి...."సుందరి అంటే చాలా బ్యూటిఫుల్‌గా, సింపిల్‌గా, వండ్ర ఫుల్‌గా వుంది."

సూరమ్మ కాస్సేపాలోచించింది—"మరి మీ పేరు మాత్రం? సుబ్బారావంటే....ఏం బావుంది? మీరూ మార్చేసుకోండి."

సుబ్రావ్ కొంచెం తెల్లబోయాడు. "అసలు నన్నలా ఎవ్వరూ పిలవరు. వెంకట్ అంటారు.

"వెంకట్టంటే మాత్రం? కిశోర్‌లా ఉంవా? ప్రదీప్‌లా ఉందా?"

"లేదనుకోండి. అసలు మా మదర్‌కి చాలాకాలం వరకూ పిల్లలు లేరని....ఎన్నో మొక్కులు మొక్కిందట. ఓసారి వెంకటేశ్వరస్వామి పటం కల్లో కనపడిందట. సుబ్రమణ్యేశ్వరస్వామి నిజంగా దొడ్లో కనపడ్డాట. ఆ తర్వాతే నేను పుట్టాన. అందుకనీ....నాకీ పేరు పెట్టారు. అందుకే నేనూ ఊరుకున్నాను." సకారణంగా మాట్లాడాడు వెంకటసుబ్బారావు.

సూరమ్మ తెగ ఆశ్చర్యపోయింది—"నా పేరు మా అమ్మమ్మ పేరే గానీ....మీ పేరు....అబ్బో! కొన్ని యుగాలు పాతది. ఫర్వాలేదు. సునీల్ అని మార్చేసుకోండీ? బావుంటుందీ."

కుర్రాడు కాస్సేపు ఆలోచించి .... "కొంచెం ఆలోచించాలి" అన్నాడు.

"పోనీలెండి. మీకిష్టంలేకపోతే మార్చుకోవద్దు. నా పేరే మార్చుకుంటాను. కాని...."

"చెప్పండి! ఫర్వాలేదు."

"అసలు శుభలేఖల్లో మన పేర్లెలా ఉండాలంటారు?"

సుబ్రావ్ కొంచెం నవ్వాడు—"ఎలాగేవిటి? మామ్మూలుగానే.... సుందరిని సుబ్బారావుకిచ్చి....ఫలానాచోట....వివా ..."

"అదుగో! అందుకే అడిగాను. ఒక మనిషి నింకో మనిషికివ్వటం ఏమిటండీ? అక్కడే మొదలౌతోంది ఆడదాని బానిసత్వం కాకపోతే, సుబ్బారావుని సుందరికిచ్చి.... అని ఎందుకు వెయ్యకూడదూ?"

"వెయ్యచ్చు. అహ! వెయ్యకూడదు కదండీ! అరె! అదెల్లాగా? అది మన సాంప్రదాయం కాదు. భారత కల్చర్‌కే విరుద్ధం!"

"పెళ్ళికూతురూ—పెళ్ళికొడుకూ తెగబడి మాట్లాడుకోవటం మన సాంప్రదాయమేనంటారు. మన కల్చరేనంటారు."

"ఇది వేరు. మీరిల్లా వాదిస్తే ఎల్లాగ?"

"ఎల్లాగంటే....ఎవర్నీ ఎవ్వరికీ యివ్వటం కాదు. సుందరికీ.... సుబ్బారావుకీ... ఫలానాచోట....వివాహమగును. కాబట్టి అందరూ రండి, అంటే సరిపోతుంది."

"అవును. బాగానే వుంది. బాగుంది. బాగుందండీ!"

"మరేమోనూ... సుందరంటే....నా ఫ్రెండ్స్‌కీ, చుట్టాలకీ ఎవ్వరికీ తెలీదు. అందుకనీ....'సూరమ్మ అనే సుందరికీ—వెంకట సుబ్బారావుకీ' వివాహమగును. అని వుండాలి. బాగుంది కదండీ!"

సుబ్బారావు మొహం మళ్ళా చూడాలి. ఈపిల్ల ఏబళ్ళో చదివిందో! పాడుబడి! కాలికేస్తే మెడకీ, మెడకేస్తే కాలికీనా? నాన్సెన్స్!

"ఏం మీ కిష్టంలేదా?"

"అబ్బే! ఫర్వాలేదు. అల్లాగే. అదే బావుంది."

"థాంక్స్!....సారీ! అసలు సంగతి అడగటం వెనక పెట్టాను. మీ అభిప్రాయం ఎంతలో ఉందంటారు? అదే డౌరీ మాట లెండి."

సుబ్రావ్ కొంచెం సిగ్గిల్లాడు— "అదంతా పెద్దవాళ్ళు మాట్లాడుతున్నారు కదండీ!"

"అది మనకు సంబంధించింది కాదంటారా?"

"అబ్బే! అదికాదు. అది సెటిలైపోయింది కదాని...."

"అదే నా కిష్టంలేదు. మీ వాళ్లు ఎనభై వేలు అడిగారు. మావాళ్లు ఇచ్చేస్తామన్నారు. పై లాంఛనాలన్నీ కలుపుకుంటే ఓ లక్షవరకూ పాకింది. కానీ, మీరేమీ అనుకోవద్దు. కట్నం యిస్తేనేగానీ నన్ను పెళ్ళి చేసుకోటాని కిష్టపడని వ్యక్తి నాకక్కర్లేదు. అలాంటివాళ్ళని నేను చాలా హేట్ చేస్తాను."

మూడోసారి చూడాలి సుబ్రావ్ మొహం.

"సారీ! ఎమోషనల్‌గా మాట్లాడాను. మీరు నన్ను అపార్థం చేసుకోకండి. కేవలం వ్యక్తుల మధ్య బలపడ్డ అభిప్రాయాలకి విలువ వుంటుంది. డబ్బుకి హోదా వుండచ్చుగానీ— దానికి వ్యక్తికన్నా అధికమైన విలువ ఎప్పుడూ ఉండదు. ఏమంటారు?"

సుబ్రావ్ మైండ్ చకచకా ఆలోచించేస్తోంది.

క్విక్! క్విక్! ఏదో నిర్ణయాని కొచ్చెయ్యాలి.

ఈ పిల్ల మహా తెలివైందిలా వుంది. గడుసుదిలా వుంది. ఇవ్వాళ కట్నం వద్దన్నా రేపు తన వాటా తను తెచ్చేసుకుంటుంది. ఊరుకోదు. పుట్టింటివాళ్ళకి ఛస్తే దొబ్బబెట్టదు. ఈ ముసిలాడు మాత్రం ? కన్న కూతుర్ని అన్యాయం చేస్తాడా?.... హారి వీడి కడుపుడకా! పుట్టగతు లుంటాయా? అసలు ఆడపిల్లలకు కూడా తండ్రి ఆస్తిలో సమాన వాటా లున్నాయిట. ఏదో సినిమాలో చూపించారు. మాట్లాడకుండా ఆ మూడు ముక్కా వేసేసి--నా భార్యావాటా కక్కుతావా? ఛస్తావా? జైలుకెళ్తావా?...." అని బెదిరిస్తూ ఓ సూట్ పడేస్తే సరి. ఎక్కడికి పోతాడు?

మైగాడ్! ఫారెన్ జర్నీ!.... అమెరికా... అమెరికా మాటేవిటి? అసలందుకేకదా ఈ తిప్పలన్నీ! డబ్బు కావాలి డబ్బు. ఛస్తే యివ్వను పొమ్మన్నాడు ఫాదర్ ఓ సారడిగితే. అసలు ఛావనే ఛావను పొమ్మన్నాడు. రెండోసారడిగితే. పెళ్ళి చేసుకుని, కట్నం తెచ్చుకుని, యిష్టం వచ్చినట్టు తగలేసుకోమన్నాడు— ముచ్చెంగా మూడోసారి. వాటె గుడ్

సజెషన్, ఎనభై వేలు, ఎయిటీ థౌజండ్. చేతిలో పడిపోయాయనుకున్నా డింతవరకూ, ఇప్పుడీ మడత పేచీ....!

"ఏవిటంతాలోచిస్తున్నారు? కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకోవటం మీ కిష్టం లేనట్టుంది."

"నో, నో....అది కాదు. అదేంకాదు. అసలు నేను డౌరీ సిస్టమ్‌నే హేట్ చేస్తాను. సంతలో పశువులా అమ్ముడుపోవటానికి నేనేం సంతలో పశువునా? మన ఆదర్శాలు రెండూ కలిశాయి. ఐయాం వెరీ హేపీ, హేపీ! కానీ మా ఫాదర్ ఏమంటాడోనని!"

"ఏమీ అనరు. మీ అభిప్రాయం చెప్పండి."

"చెప్తాను. చెప్తాను. ఐ విల్ టెల్ హిమ్."

పేపర్లో మాయమైన ముసలాయన హఠాత్తుగా బయటపడి, "హారినీ! ఇదేం విడ్డూరం? అమెరికా విమానాలన్నీ పాత డబ్బాల్లాగా, పెంకు పురుగుల్లాగ, తుక్కు తుక్కుగా రాలిపోతున్నాయే! వాళ్ళ మాన్యుఫ్యాక్చరీ అల్లా తగలడుతోంది." స్వగతం గట్టిగా చెప్పుకుంటూ ఆశ్చర్యపడిపోయాడు.

"అబ్బ! నెమ్మదిగా చదువుకో నాన్నా! డిస్టర్బ్ చేస్తున్నావ్ మమ్మల్ని." అంది కొంచెం విసుక్కుంటూ సూరమ్మ సుబ్రావ్‌కేసిచూస్తూ. "అసలు వరకట్నానికీ, స్త్రీ ధనానికీ తేడా వుందండీ!" అంటూ విషయం మళ్ళా ఎత్తుకుంది.

"ఏవిటది?"

"చాలా వుంది. కట్నం అంటే అది కేవలం బేరం. అదంతా పెళ్ళికొడుకు చేతిలో పడుతుంది. అదంతా ఎలా ధ్వంసమైపోయినా పిల్లతరుపు వాళ్ళు అడగటానికి వీల్లేదు. వేలకొద్దీ కట్నం యిచ్చి తాడు కట్టించుకున్న తర్వాత—పిల్లగతి అధోగతే. పువ్వులకో అణాడబ్బులు కావాలంటే ముష్టెత్తాలి. అలా నరకాలనుభవిస్తోన్నవాళ్ళ నెందర్నో చూస్తున్నాను. స్త్రీ ధనం అంటే అలాకాదు. పుట్టింటివాళ్ళిచ్చే తృణమో, ఫణమో పిల్ల

పేర్న వుంటుంది. తన అవసరాలు తను చూసుకుంటుంది. అవసరమైతే భర్తకి సహకరిస్తుంది. అసలు చిన్నా, పెద్దా. ఆడా, మగా భేదంలేకుండా ఏ మనిషికైనా ఆర్థిక స్వాతంత్ర్యమే ముఖ్యం. మీ తండ్రి మీ కిచ్చే ఆస్తి మీ పేరే వుంటుంది కదా? అలాగే నా తండ్రి నా కిచ్చే ఆస్తి నా పేరే వుంటుంది. వుండాలి."

సుబ్బారావు అమాయికంలోపడి, స్పష్టంగా తెల్లబోయాడు. ఈ పిల్ల తాళాలు బొడ్లో బిగించేలా వుంది. రెంటికీ చెడిపోను కదా? మైగాడ్! నాకేం దారి? ఒప్పుకోనా? వద్దా? పిచ్చిగానీ, ఎన్ని కబుర్లు చెప్పినా ఏ ఆడవాళ్ళయినా.... పెళ్ళయ్యాక మొగుడి గుప్పిట్లోకి రావాల్సిందే. ఒప్పేసుకుంటాను. లక్ష రూపాయలు వన్ లేక్?

"మీకు ఇష్టం ఉన్నట్టులేదు."

"అబ్బే! అదేం లేదు. నాకిష్టమే. నా కెంతో యిష్టం. మీరు నాకు బాగా నచ్చారు." ముసి ముసి నవ్వులు నవ్వుతూ చెప్పాడు సుబ్రావ్ వెంకట్. "నువ్వు నాకు చాలా నచ్చావు సుందరీ!" అని కూడా అనాలని మనసు తెగ పీకేస్తోంది. ఇప్పుడు కాదు సాయంత్రం బీచ్ కెళ్ళినప్పుడు, లేదా పిక్చర్ కెళ్ళినప్పుడు.....

"ఇంకా నన్నేమైనా అడగాలా?" ఛాన్సు ఇచ్చింది సూరమ్మ. —"వూహూ? ఏం లేదు. మీకు పాటలొచ్చా?.... ఎందుకంటే నాకు మ్యూజిక్కంటే చాలా యిష్టం. ఐ లైక్ మ్యూజిక్ వెరీమచ్."

"వచ్చు." అంది అమ్మాయి నవ్వుతూ.

సుబ్రావ్ సోఫా వెనక్కి వాలి అరమోడ్పు కన్నులు పెట్టి కూచున్నాడు.

"పాడమని నన్నడగ దగునా?" అంటూ ఎత్తుకుంటుందనుకున్నాడు. ఎంతకీ పాడదు సరికదా, "ఏం? అలా కూచున్నారు?" అడిగింది.

సుబ్రావ్ కొంచెం తెల్లబోయాడు. సర్దుకుని స్టైయిలిష్‌గా నవ్వుతూ, "మీరు పాడితే వినాలని వుంది" అన్నాడు.

"సారీ! నాకు పాడటం రాదండీ! మా తమ్ముడు సినిమా పుస్తకాలవీ కొని తెచ్చుకుంటాడు. పాటలన్నీ చదువుతూంటాను."

వన్స్‌మోర్! చూడాలి సుబ్రావ్ మొహం!

కోపం వచ్చిందేమో జవాబు చెప్పలేదు, చిరాగ్గా సైం చూసుకున్నాడు.

"నన్నడిగి తెలుసుకోవాల్సిందింకేమీ లేదా? మాట్లాడండీ! ప్లీజ్!" నవ్వుతూ అర్థించింది అమ్మాయి.

సుబ్బారావు కోపం పటాపంచలైంది. తేలిగ్గా నవ్వేశాడు.

"ఏమీలేవండీ! మీకు వంటొచ్చా? కుట్లొచ్చా? అంటూ సిల్లీలా అడగటం... ఐ హేట్ దట్ నాన్సెన్స్."

"థాంక్స్!" సూరమ్మ సోఫాలోంచి లేచింది—"నాన్నా! నేను లోపలి కెళ్తున్నాను" అంది వాళ్ళ నాన్న నుద్దేశించి. వెంకట సుబ్బారావుకేసి చిరునవ్వు చిందిస్తూ చూసింది.

"మీరు నన్ను క్షమించాలి. నా మనసులో మాట చెప్పేస్తాను. నేను మీకు నచ్చానన్నారు. బావుంది. మీరుకూడా నాకు నచ్చారో లేదో నన్నడిగి తెలుసుకోవాలని తెలియలేదు మీకు. అసలు మీ అభిప్రాయాలేవీ స్థిరంగా లేవు. క్షణానికోలాగ మార్చేసుకోగలిగారు. క్షమించాలి నన్ను. మీరు నాకు నచ్చలేదు."

ఇక చూడండి సుబ్రావ్ మొహం.